# ప్రసన్నలు

ఇల్లు తాళం పెట్టి వుండడం చూసి నిర్విణ్ణుడయాడు శివరామకృష్ణ, పక్కయింటివారికి తాళం చెవి ఏమైనా యిచ్చి వెళ్ళిందేమోనని వాళ్ళింటికి వెళ్ళాడు. అక్కడికి వెళ్ళేవరకూ ప్రసన్న విషయం ఏమీ ఆలోచించుకోవటానికి వీలులేక పోయింది. అతని బుర్ర పనిచెయ్యలేదు.

సుందరమ్మగారింటికి వెళ్ళగానే ఆవిడ యితన్ని చూసి చిరునవ్వు నవ్వింది అనుమానాన్ని నిజం చేస్తున్నట్లు. "ప్రసన్న తాళం చెవి ఏమైనా ఇచ్చిపోయిందండీ పిన్నిగారూ" అనడిగాడు శివరామకృష్ణ.

"అవును నాయనా ఒక గంట క్రితమే యిచ్చిపోయింది అని సుందరమ్మగారు చెప్పి లోపలికి పోయి తెచ్చి యిచ్చింది.

"మీతో ఏమయినా చెప్పిందేమిటండి పిన్నిగారూ?" అని అడిగాడు ఆవిడను తిరిగి.

"లేదు నాయనా, ఏమీ చెప్పలేదే."

శివరామకృష్ణకి ఏం చెయ్యటానికి తోచలేదు. "పోనీ ఆమె వెళ్ళేటప్పుడు మీరు చూశారా? చేతిలో ఏమయినా సామాను వుందా?" అని ప్రశ్నించాడు.

"ఏదో సూట్ కేసు వున్నట్లుంది అబ్బాయి. జట్కా లోనే వెళ్ళింది. ఎక్కడికమ్మా అని ప్రశ్నించినా జవాబు చెప్పలేదు" అని సుందరమ్మగారు అన్నది.

సరియైన సమాధానం రాకపోయేసరికి శివరామకృష్ణ నిస్పృహగా వెనక్కి తిరిగాడు. అతను నాలుగైదు అడుగులు వేసినంతలో వెనకనుండి సుందరమ్మగారు "చూడబ్బాయి, మీరిద్దరూ ఏమైనా తగవులాడుకున్నా రేమిటి?" అని అడి గింది చిరునవ్వుతో.

"అబ్బె ఏం లేదండీ!" అని చెప్పి బయటికొచ్చేసి తన యింట్లోకి ప్రవేసించాడు అతను ఇల్లంతా వెక్కిరిస్తున్నట్లుగా కనిపించింది. ప్రసన్న లేని గృహం కళావిహీనంగా అగుపిం చింది. ఇంట్లోకి ప్రవేశించగానే యీజీఛైరులో కూలబడి జేబులోంచి సిగరెట్టు తీసి ముట్టించాడు. అతని నోట్లోంచి పొగ రింగురింగులుగా వస్తూవుంటే అతని ఆలోచనలు కూడా తలలో గిర్రున తిరుగసాగాయి. ప్రసన్న పుట్టింటికే వెళ్ళివుం టుంది. ఇవాళ ప్రొద్దున్న వ్యవహారం బెడిసేటప్పటికి వాళ్ళిం టికి వెళ్ళిపోతానని అరిచింది. తను పోతే పొమ్మన్నాడు. అని బయటికి వచ్చాడు. ఉదయం కోపంవల్ల యింటికిపోబుద్ధి పుట్టకపోతే హోటల్లోనే తిని సాయంత్రం వరకూ తిరిగితిరిగి యిప్పుడు యింటికి వచ్చాడు. ఇక్కడ పరిస్థితి యిలాగవుంది. భార్య గంట క్రితమే వెళ్ళిందని సుందరమ్మగారు చెప్పింది.

ఇప్పుడు ఆరున్నర అయింది. అంటే అయిదన్నరకు యిల్లు విడిచి పోయిందన్న మాట. ఇక్కడనుంచీ వాళ్ళ వూరుకు ఆరింటికి ట్రెయిను వుంది. సందేహ మెందుకూ? తప్పకుండా అందులో పోయివుంటుంది అనుకున్నాడు శివరామకృష్ణ.

ట్రెయిను ఒకవేళ ఏమయినా అసల్యమైనదేమో స్టేషనుకి పోయి లాక్కువద్దా మనుకుంటే అది మధ్యాహ్నం నుంచి స్టేషనులోవుండి సాయంత్రం ఆరింటికల్లా ఖచ్చితంగా బయలుదేరే బండి. అందుచేత ఆ ప్రయత్నం విరమించు కున్నాడు అతను.

అతనికి కోపం తీవ్రంగా వచ్చింది. ఇంతలో ఏదో గుర్తువచ్చి జేబులోంచి ఒక రంగు గాగితం చుట్టేవున్న వస్తువు బయటకు తీసి ఒకసారి దానివంక తీక్షణంగా చూసి నేల మీదకు విసిరేశాడు. అదిపోయి ఒక మూలవున్న పాతగుడ్డల్లో పడింది.

"ప్రసన్న నాకింత అవమానం కలుగజేసింది, భర్తనైన నేను ఆమాత్రం అనటానికి అర్హత లేకపోతే ఎలాగ? అయినా నే నేమన్నానసలు? ఆమె కోపానికి జడిసి వాళ్ళింటికి పోయి తీసుకు వస్తాను అనుకున్నది కాబోలు. నేనలా ఎప్పటికీ చెయ్యను. ఒకవేళ ఆమె తిరిగివచ్చినా అంగీకరించను" అని నిశ్చయించుకున్నాడు.

అసలు శివరామకృష్ణ, ప్రసన్న చాలా అన్యోన్యంగా వుండేవారు. శివరామకృష్ణ ఆ వూళ్ళో వుపాధ్యాయవృత్తిని చేస్తుండేవాడు. అతనికి వచ్చే తొంభై రూపాయల జీతంతో

వాళ్ళ జీవితం అదోవిధంగా గడిచి పోయేది. ఏమయినా వాళ్ళకు మాత్రం డబ్బు లేదనే చింత వుండేదిగాదు. ఉన్న దాంతోనే సంతృప్తి చెందేవారు.

అయితే శివరామకృష్ణకు మాత్రం ఒక చింత పట్టుకొంది. ఏమిటంటే తన భార్య కాపురానికొచ్చి నాలుగేళ్ళయింది; ఆమె కింతవరకూ ఒక్క నగయినా చేయించలేదని విచార పడేవాడు. ప్రసన్న కూడా మొదట్లో అప్పుడప్పుడూ అడిగేది ఏమయినా చేయించపెట్టమని. అటువంటప్పుడు అతను తెల్లబోయి చూచేవాడు. తమ పరిస్థితి తెలుసుకుని ఆమె అడగటం మానుకుంది. కాని శివరామకృష్ణకు మాత్రం భార్య కోరిక నెరవేర్చాలనే నిశ్చయం బలంగా వుండేది. అందుకోసం ఆలోచించి ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చాడు. ఆ తర్వాత కొన్ని రోజులకి అతను యింటికి రాత్రిపూట కొంచెం ఆలస్యంగా రావటం మొదలుపెట్టాడు. ప్రసన్న ఆ విషయంలో అతన్ని ప్రశ్నించేది. అతను స్నేహితుడితో ఎక్కడికో వెళ్ళాననో స్కూల్లో పని ఎక్కువయినందువల్ల ఆలస్యమయిందనో సమాధానం చెప్తూవుండేవాడు.

ఈ విధంగా చాలా నెలలు గడచి పోయాయి. ఒక రోజు ఆమె స్నేహితురాలు కమల వచ్చి చాలా చాలా మాట్లాడిపోయింది. ఆమాటలు విన్న తర్వాత ప్రసన్నకు ఎక్కడలేని కోపమూ వచ్చింది. భర్త ఎప్పుడు ఇంటికి వస్తాడా అని కనిపెట్టుకు కూర్చుంది.

మామూలుగానే శివరామకృష్ణ చీకటి పడుతూండగా యింటికి వచ్చాడు. ప్రసన్న అతనివంక తీక్షణంగా చూస్తూ

"రోజూ యింత ఆలస్యం ఎందుకవుతుందో చెప్పితీరాలి" అని అడిగింది. శివరామకృష్ణ కొంచెం చకితుడయ్యాడు. "నన్ను ఎందుకు పూరికినే అనుమానిస్తావు ప్రసన్నా. ఏ స్నేహితుడో లా క్కెళ్ళటం వల్ల ఇంత ఆలస్యం అవుతూంది" అని బదులు చెప్పాడు.

ప్రసన్నకు కోపం హెచ్చింది. "అవును. ఆమాటలు యింకా నమ్మతా ననుకున్నారు కాబోలు. స్నేహితుడు లాక్కు వెళ్ళాడా? లేక స్నేహితురాలింటికి దయచేస్తున్నారా? అని అడిగింది.

"నువ్వు ఏదో మాట్లాడుతున్నావు ప్రసన్నా, కొంచెం ఆలోచించి మాట్లాడు!"

భర్త సమాధానం విని ప్రసన్న చలించలేదు "నా కన్నీ తెలుసును. రోజూ సాయంత్రంపూట శకుంతల అనే అమ్మాయి యింటికి వెళ్ళటం లేదూ?" అని ప్రశ్నించింది.

"ఇది మరీ బాగుంది. ఆమె అన్న నా స్నేహితుడు. అతనికోసం వెళ్తాగాని ఆమెకోసం వెళ్తానంటావా?" అన్నాడు శివరామకృష్ణ.

"ఇంకా దాచటానికి ప్రయత్నించకండి. మీ స్నేహితుడికోసం వెళ్తే ఆమెతో మాట్లాడటం ఎందుకు? ఇంకా నయం. కమల యిల్లు అక్కడికి మారింది కాబట్టి యిప్పటికయినా తెలిసింది. లేకపోతే యింకెన్నాళ్లు మోసపోయే దాన్నో?"

"ఇక చాలించు ప్రసన్నా. వాళ్ళూ వీళ్ళూ చెప్పిన మాటలు విని నన్ను అనుమానిస్తున్నట్లుంది. నేను ఆమెతో ఎప్పుడూ మాట్లాడలేదు. అ అవసరంకూడా నాకు లేదు."

భర్త తన తప్పును ఒప్పనుకుంటాడనుకుంటే అతను లొంగేటట్లు కనిపించ లేదు. కాని ప్రసన్నకు మాత్రం భర్త మీద అనుమానం దృఢపడిపోయింది.

ఆ రోజునుంచి అదో విధమైన దృష్టితో భర్తను చూడసాగింది. అతను ఆలస్యంగా రావటం మానుకోలేదు. కమల రోజూ వచ్చి ఒక్క రోజయినా తప్పకుండా శివరామ కృష్ణ, శకుంతల యింటికి హాజరు అవుతున్నాడనీ, వాళ్ళిద్దరూ చాలా చనువుగా వుంటారనీ, చాపమీద కూర్చుని ఏమో రాసుకుంటూ వుంటారనీ చిత్రవిచిత్ర వార్తలు అందించేది. అతని స్నేహమంతా శకుంతలతోనే వున్నట్టు కనిపిస్తూంది గాని ఆమె అన్నతో అసలు మాట్లాడినట్లుకూడా కనిపించదని చెప్పింది. ప్రసన్నకు లోలోపల క్రోధం పెరిగిపోయింది. ఇన్నాళ్ళనుంచీ తన్ను ప్రేమగా చూస్తున్న భర్తకు ఇప్పుడు తను ఏవగింపు అయినట్లుగా భావించింది.

ఆరోజు వుదయం శివరామకృష్ణ చాలా వుషారుగా కనిపించాడు. పెట్టెలోంచి ఏదో పుస్తకం తీసి జేబులో పెట్టు కున్నాడు. పదింటికి బయటకు పోబోతూ భార్యతో కొంచెం ఆలస్యంగా వస్తానని చెప్పాడు. ఇన్నాళ్ళ నుంచీ భర్తపై హృదయంలో పెంచుకుంటున్న కోపం యీనాడు ప్రసన్న బయటకు వెళ్ళగ్రక్కింది. అంత వుషారుగా వుండటానికి

కారణం శకుంతల యింటికి పోబోతూండటమేనని తలచి "దాని యింటికివెళ్తే వేళాపాళా తెలిస్తేగా. ఇంటి ధ్యాస అసలు ఎందుకు వుంటుంది? అక్కడే గడపండి" అన్నది.

శివరామకృష్ణ తెల్లబోయాడు. "ప్రసన్నా ఆ విషయం ఇంకా మరచిపోనట్లుంది. ఇవ్వాళ నన్ను చిరాకు పరచకు నా ఆనందాన్నంతా భగ్నంచేసినదాన వవుతావు" అన్నాడు.

"ఆనందానికి నేనే మడ్డం వచ్చానూ? నే నక్కడికి ఏమయినా వెళ్ళవద్దన్నానా? అయినా ఎవరెట్లాపోతే నాకేం పోయింది?" అన్నది ప్రసన్న మండిపడుతూ.

శివరామకృష్ణకు కూడా బాగా కోపం వచ్చింది. తన మనస్సుని అనవసరంగా గాయపరుస్తూంది అనుకుని "నీ మొహానికి సంతోషించే గీతలేదు. అనవసర అనుమానాలు పెట్టుకుని కుళ్ళుతావు. అలానే అఘోరించు" అని తిట్టాడు. ప్రసన్నకూడా కోపంలో ఏమేమో అన్నది. చివరికి వాగ్వివాదం బాగా పెరిగిపోయింది. ప్రసన్న యిక కోపం ఆపుకోలేక "నేనీ నరకకూపంలో వుండలేను. ఇంతకంటె మావాళ్ళ యింటికి పోతే హాయిగా వుంటుంది" అన్నది.

ఇక్కడుండమని ఎవడేడిచాడు? నీ యిష్టం వచ్చినట్లు చావు" అనేసి శివరామకృష్ణ బయటికిపోయాడు. ఆ పోవటం పోవటం సాయంత్రానికి యింటికి రాలేదు. వస్తే పరిస్థితి యిలాగ వుంది.

ఇతను యీజీఛైరులో కూర్చుని ఆలోచించిన కొద్దీ మనస్సు మారిపోసాగింది. చివరికి తను చేసిందే తప్పు అనే

నిశ్చయానికి వచ్చాడు. నిజమే తను యింతవరకూ యీ విషయం ప్రసన్నకు చెప్పకుండా యెందుకు దాచాడు. ఆమె మనసులో తనమీద అనుమానం చేత బాధ పడుతున్నా తను యింకా చెప్పకుండా పరిస్థితిని యింతవరకూ తెచ్చుకోన టం నిశ్చయంగా బుద్ధి తక్కువే. భర్త ప్రవర్తన ఆ విధంగా వుంటే ఏ స్త్రీ మాత్రం సందేహించదు? అనుకుని పశ్చాత్తాప పడసాగాడు. అతనికి భార్యమీద వున్న కోపమంతా ఎగిరి పోయింది. ఆమెకు తన క్షమాపణలు చెప్పుకుని తిరిగి యెప్పటి లాగా వుండాలని అనుకున్నాడు.

అయితే ప్రసన్న యిప్పుడు ఎక్కడుంది? తన బుద్ధి పొరపాటుచేత ఆమెను పుట్టింటికి పంపాడు. తను అక్కడికి ఆమెను పిలుచుకు రావాలా?

శివరామకృష్ణ ఎటూ నిశ్చయించుకోలేక పోయాడు. కుర్చీలోంచి లేచి అటూయిటూ తిరుగుతూ ఆలోచించ సాగాడు. అతనికి అంతకుముందు విసిరివేసిన వస్తువు సంగతి జ్ఞాపకం వచ్చింది. దానిని తీసి పదిలంగా జేబులో పెట్టు కున్నాడు.

అంతలో వాకిట్లో బండి ఆగిన చప్పుడయింది. అతను ఆరాటంగా బయటకు వచ్చి చూశాడు. బండిలోంచి దిగింది తన భార్య. తన కళ్ళను తను నమ్మలేక పోయాడు. ఒక రైలు తప్పి పోయిందేమో.

ప్రసన్న బండివాడికి డబ్బులిచ్చి పంపేసి లోపలికివచ్చి అక్కడ ప్రతిమలాగ నిల్చునివున్న శివరామకృష్ణ వక్షంలో

18)

తలదాచుకొని "ఏమండీ. మీరు వచ్చారా మీ కోసంపోయి వస్తున్నాను కమలయింటికి" అని తడబడుతున్న కంఠంతో అన్నది. ఆమె కళ్ళనిండా నీళ్లు నిండాయి.

శివరామకృష్ణ ఆమె ముంగురులను సవరిస్తూ "ఏడవ బోకు ప్రసన్నా. అసలు నువ్వు ఎక్కడికి పోయావు? నేనెక్కడ వుంటా ననుకున్నావు?" అని అడిగాడు.

ప్రసన్న అలాగే ఏడుస్తూ "నన్ను క్షమించండి. మీరు వుదయం నుంచీ యింటికి రాకపోతే యిక అప్పుడే రారేమో నా మీద కోపంచేతనని భయంవేసి నిజంగా మా వూరుకు పోదామనుకున్నాను. కాని బయలుదేరిన తర్వాత కమలవద్దకు పోయి సలహా తీసుకోవాలనిపించింది. ఆమె వద్దకుపోతే నేను చేయబోయేపనికి భయపడి అటువంటిపనులు చెయ్యవద్దని చెప్పింది. తర్వాత నా మనస్సు కూడా మారి మీకు. క్షమాపణలు చెప్పుకుందా మనుకున్నాను. అందుకని శకుంతలయింటికి వస్తారేమో ననుకుంటే ఎంతసేపటికి రాలేదు మీరు చివ్వరికి విసిగి యింటికేమయినా వచ్చారేమోనని వచ్చాను" అని చెప్పింది.

శివరామకృష్ణ ఆమె అమాకత్వానికి జాలిపడుతూ "పిచ్చిపిల్లా. నువ్వు యిన్నాళ్ళనుంచీ నన్ను అనవసరంగా అనుమానించావు. ఇప్పుడు అసలుసంగతి చెప్తున్నాను. నీకు నగలు ఏమీ చేయించలేదనే చింత నాకుండేది. అందుకని ఎలాగా అని ఆలోచించాను. అంతలో మా స్నేహితుడు తన చెల్లెలు శకుంతలకు ప్రైవేటు మెట్రిక్యులేషన్ పరీక్షకు కడుతున్నది. అతను నెలకు ఇరవై అయిదు రూపాయలు

యిస్తానన్నాడు నీకు అంతా అయింతర్వాతగాని చెప్పకూడ దని ఆ డబ్బును ఎప్పటి కప్పుడు బ్యాంకిలో వేస్తున్నాను. నిన్న అతను యిచ్చిన డబ్బుతో మొత్తం నాలుగువందల రూపాయలయింది, అది పెట్టి యివాళ నెక్లేసు కొందామను కుంటే ప్రొద్దున్న నువ్వు అనవసరంగా గొడవపడ్డావు. అయినా సాయంత్రం నా మనస్సు మార్చుకుని కొనుక్కువచ్చాను. తీరా యింటికి వస్తే నువ్వు లేవు. మీావాళ్ళ యింటికి పోయా వేమో ననుకున్నాను" అని జేబులోంచి నెక్లేసు తీసి ఆమె కంఠానికి అలంకరించాడు.

ప్రసన్న యింతకాలం నుంచీ భర్తను అనవసరంగా అనుమానించినందుకు చింతపడి భర్తచే అలంకరించబడిన తన కంఠాన్ని అద్దంలో చూసుకుని మురిసిపోయింది.